మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రముఖ వైద్య నిపుణులు

ADVT SPL

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అడ్డాకుల: పొన్నకల్ గ్రామానికి చెందిన నర్సింహరెడ్డికి సీఎం సహాయనిధి ద్వారా రూ.లక్ష మంజూరైంది. సంబంధిత ఎల్‌ఓసీని సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, నాయకులు విజయకుమార్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు కోయిల్‌సాగర్ నీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిని కుడి ఎడమ కాల్వల ద్వారా ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారని ఎంపీపీ రమాదేవి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఉదయం 11 గంటలకు దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 140 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తారని వివరించారు.



టీకాలు వినియోగించుకోవాలి

భూత్పూర్: గాలికుంట వ్యాధి టీకా కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మధుసూదన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 29 వరకు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వివరించారు.

పాలమూరులో అత్యాధునిక వైద్యం

పాలమూరు: ప్రస్తుత తరుణంలో వైద్య రంగంలో కొత్తరకం ఆవిష్కరణలు, అత్యాధునికమైన వైద్య సేవలు రోగులకు చేరువ అయ్యాయి. మెరుగైన సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు పొందడానికి ఒకప్పుడు జిల్లావాసులు ఎన్నో వ్యయప్రయాసలు పడి హైదరాబాద్‌తో పాటు ఇతర నగర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వైద్య పరికరాలు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. సాధారణ ప్రజలు సైతం నాణ్యమైన వైద్యం పొందుతున్నారు. వర్షాలు పెరిగిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున దోమల నుంచి జాగ్రత్త పడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పేదలకు అందుబాటులో



పేదలకు ప్రత్యేకమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి మహబూబ్‌నగర్‌లోని వెన్నెల సెంటర్‌లో చర్మ సమస్యలపై అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నాం.లెజర్ చికిత్సతో పాటు అనవసరమైన జుట్టు తొలగింపునకు చికిత్స ఉంటుంది. కెమికల్ ఫీల్స్‌తో పాటు స్కిన్‌కు ఆధునిక వైద్యంతో నయం చేస్తున్నాం.

–డాక్టర్ జి.పద్మరెడ్డి, చర్మవ్యాధుల కాస్మోటాలజీ నిపుణులు

నాణ్యమైన సేవలు అందిస్తున్నాం



ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా వాసుల కోసం మొదటిసారిగా పాలమూరు కంటి ఆస్పత్రిలో అత్యాధునిక కంటి ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. హైదరాబాద్ వంటి నగరాలకు ఏమాత్రం తగ్గకుండా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందిస్తున్నాం. నగరాలకు పరిమితమైన అత్యాధునిక సర్జరీ వంటి వైద్య సేవలను అందిస్తున్నాం.

–డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ పి.శశి

తక్కువ ఖర్చుతో స్కానింగ్



ఆర్‌కె డయాగ్నొస్టిక్ సెంటర్ ద్వారా అత్యాధునిక స్కానింగ్ పరీక్షలు చేపడుతున్నాం. సీటీ బ్రెయిన్, హెచ్‌ఆర్‌సీటీ చెస్ట్ వంటి స్కానింగ్‌లు చేస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఆధునికమైన స్కానింగ్ నిర్వహిస్తున్నాం. త్వరలోనే 1.5 టెస్లా 96 ఛానెల్ ఎంఆర్‌ఐ ప్రారంభించనున్నాం.

–డాక్టర్ ఎం.రజినీకాంత్, రేడియాలజీ వైద్య నిపుణుడు

అరుదైన క్యాన్సర్లకు చికిత్స



మహబూబ్‌నగర్ క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా జిల్లావాసులకు అరుదైన క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నాం. ఆస్పత్రి ఏర్పాటు చేసిన తర్వాత దాదాపు 150అతి పెద్ద క్యాన్సర్ శస్త్రచికిత్సలతో పాటు 500వరకు కిమోథెరపీ సేవలు అందించాం. మొదటి దశలో క్యాన్సర్ లక్షణాలు గుర్తిసే సకాలంలో వైద్యం అందించి రోగిని కాపాడవచ్చు.

–డాక్టర్ బిల్లకంటి రాజ్‌కుమార్, క్యాన్సర్ వైద్యనిపుణుడు

జిల్లాలో సూపర్ స్పెషాలిటీ సేవలు



సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు జిల్లావాసులకు సులభంగా అందాలన్న ఉద్దేశ్యంతో శాన్వి ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చాం. హైదరాబాద్ స్థాయిలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం.

–డాక్టర్ వాసు చైతన్య, శాన్వి ఆస్పత్రి వైద్య నిపుణుడు

నాయకులకు ఘనసన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మైనార్టీసెల్ నూతన అధ్యక్షుడు ఎండి.ఫయాజ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఖురేషీ, పట్టణ అధ్యక్షుడు జహీర్, పట్టణ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్‌నాయక్‌లను, పార్టీలో చేరిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధా అమర్, మాజీ మార్కెట్ చైర్మన్ అమరేందర్‌రాజు తదితరులను సోమవారం సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: పొన్నకల్‌కి చెందిన బైండ్ల కొండమ్మ, హరిజన్ కృష్ణయ్య, తమ్మలి కృష్ణమ్మలకు రూ.2వేల చొప్పున జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. స్థానిక నాయకులు సోమవారం వారికి నగదు అందజేశారు. విజయకుమార్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహరెడ్డి, కర్నె సత్యనారాయణ, నరేందర్, ఆంజనేయులు ఉన్నారు.

ఆలయ భూముల సర్వే



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వర స్వామి ఆలయ భూములను సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సర్వే నంబర్ 926లో ఉన్న 12 ఎకరాల భూమికి మండల సర్వేయర్ పార్వతి హద్దులను ఏర్పాటు చేయించారు. కబ్జాకు గురి కాకుండా సర్వే రిపోర్టు ఆధారంగా భూమి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.


జాతీయ పోటీలకు మాడ్రన్ స్కూల్ విద్యార్థిని



మహబూబ్‌నగర్ క్రీడలు: పాండిచ్చేరిలో ఈనెల 3 నుంచి 9 వరకు జరిగే 48వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మాడ్రన్ హైస్కూల్ విద్యార్థి సాయి నిఖిత ఎంపికైంది. సోమవారం పాఠశాలలో విద్యార్థినిని ప్రిన్సిపాల్ దత్తు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు విలియం, అర్పిత పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో చదివి క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ రవికుమార్ సోమవారం అభినందించారు. 185 మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సుజీవన్, లింగన్‌గౌడ్ పాల్గొన్నారు.





అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జడ్చర్ల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాల అమలులో పక్షపాతంగా వ్యవహరించేవని అన్నారు. సీఎం కేసీఆర్ ఆడబిడ్డల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎవ్వరు ఊహించని విధంగా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ కిట్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నారని వివరించారు. సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

బాలానగర్: రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేసి అప్పజెప్పాలని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. పెద్దాయపల్లి శివారులోని సర్వే నం.102లో భూమిని సోమవారం పరిశీలించారు. గతంలో రైతులకు కేటాయించిన భూమిలో ప్రైవేటు వ్యక్తులు ప్రహరీ నిర్మిస్తున్నారని అన్నారు. తహసీల్దార్‌ను కలిసి వివరించారు. చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ స్పందిస్తూ గతంలోనే అక్కడ ప్రహరీ ఉందన్నారు. మంగళవారం సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రభుత్వ భూమిలోకి వెంచర్ నిర్వాహకులు వచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తిరుపతి, నరేందర్ రెడ్డి, హరిసింగ్, పెంట్యానాయక్, కరుణాకర్ రెడ్డి, సత్యంచారి పాల్గొన్నారు.

లిఫ్ట్‌ను తొలగించండి

జడ్చర్ల: చైతన్యనగర్‌లో రోడ్డుపై అక్రమంగా ఓ ఇంటి యజమాని లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారని, దీంతో తమ ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని సోమవారం మున్సిపల్ అధికారులకు బాధితుడు రాజేశ్వర్ ఫిర్యాదు చేశారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.





